క్లుప్తంగా

ఎమ్మెల్యే భూమనకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న నాటా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి నాటా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో భూమన కరుణాకరరెడ్డిని కలిసి నాటా సభలకు హాజరైనందుకు దుశ్శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి తుడా చైర్మన్ నివాళి

పాకాల: వల్లివేడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అంజయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. ఆదివారం తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వల్లివేడు గ్రామానికి చేరుకుని అంజయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సోదరుడి మృతితో బాధలో ఉన్న వల్లివేడు పంచాయతీ పార్టీ కన్వీనర్ మురళీధర్‌రెడ్డిని మోహిత్‌రెడ్డి ఓదార్చారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, సర్పంచ్ ప్రత్యూష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా పక్కాగా ఉండాలి



ఓటరు శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: జనవరి 5న ఎన్నికల కమిషన్ విడుదల చేసే ఓటర్ తుది జాబితా పక్కాగా ఉండాలని తిరుపతి ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారం రెండు రోజులపాటు ప్రజల కోసం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటరు శిబిరాలను ఆదివారం కమిషనర్ హరిత పరిశీలించారు. నగరంలోని జగన్మాత హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్ర వద్ద ఓటర్ శిబిరంలో ఓటర్ నమోదు సూపర్‌వైజర్, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి కేఎల్ వర్మకు ఆమె పలు సూచనలు చేశారు.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం



సంఘీభావ సదస్సులో ప్రసంగిస్తున్న సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ

తిరుపతి కల్చరల్: ఇజ్రాయిల్ యుద్ధంతో తల్లడిల్లుతున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలపాలని సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ పిలుపునిచ్చారు. భారీ వర్షంలో సైతం పౌరచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అమరావతినగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో పాలస్తీనా ప్రజల పోరాట సంఘీభావ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి, పౌరచైతన్య వేదిక నేత ప్రతాప్ సింగ్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ముషీర్ అహ్మద్, సామాజిక కార్యకర్త అజీజ్ బాషా, హరీష్, మహేష్ తేజస్వి, ఉన్నతి, అజయ్, మహ్మద్ ఆసిఫ్ పాల్గొని ప్రసంగించారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించేందుకు సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజీ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బుచ్చినాయుడుపల్లి పంచాయతీ శంకరయ్యగారిపల్లిలో లాంఛనంగా ప్రారంభించి, పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లి ఇతర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పేదలందరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు చేస్తున్న ఈ కార్యక్రమానికి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిత్యావసర సరకుల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ఎస్టీకాలనీలో ఆదివారం సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. తుపాన్ ప్రభావంతో కాలనీలోని సుమారు 15 కుటుంబాలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రజలకు సూచిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తిరుపతి వీధుల్లో నిలిచిన నీటితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



విరుచుకుపడుతున్న మిచాంగ్

- తిరుపతిలో ఎడతెరిపిలేని వర్షం
- నీట మునిగిన కాలనీలు
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- విస్తృత సహాయక చర్యలు చేపట్టిన కార్పొరేషన్ అధికారులు
- పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు

తిరుపతి తుడా: తిరుపతి నగరంపై మిచాంగ్ తుపాను విరుచుకుపడుతోంది. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి వర్షాలు ఎక్కువగా ఉండడంతో నగర ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తిరుపతి నగరంలో 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికార వర్గాల సమాచారం. నగర శివారు ప్రాంతాల్లోని కాలనీలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అప్రమత్తమైన నగరపాలక సంస్థ అధికారులు నీట మునిగిన కాలనీలను పరిశీలించారు. మరో రెండు రోజులపాటు తుపాను ప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు

తిరుపతి నగరంలో ఎస్టీవీ నగర్, గాంధీపురం, శివజ్యోతి నగర్, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, కట్టకింద పల్లి, ఆటోనగర్, మధురానగర్, కొర్లగుంట, మాధవ నగర్, లక్ష్మీపురం, కొరమేనుగుంట తదితర ప్రాంతాలలో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరుతోంది. నీట మునిగిన కాలనీల్లో తహసీల్దార్ వెంకటరమణ పర్యటించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాటు చేశారు. కమిషనర్ హరిత స్వయంగా ఆదివారం పర్యటించి నీరు నిలచిన కాలువలలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఇళ్లకే పరిమితమైన ప్రజలు

తుపాను ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నగర ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యాయి. దీంతో నగరంలో ప్రధాన రహదారులు చాలా వరకు ఖాళీగా దర్శనమిచ్చాయి. మరో రెండు రోజులపాటు తుపాను ప్రభావం నగరంపై ఉండడంతో అధికారులు పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. నగరంలోని పలు వీధుల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో వాహనదారులు అసౌకర్యానికి గురికావాల్సి వచ్చింది. నగర ప్రాంత ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ఇప్పటికే అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.



కూలిన స్టూడియో పైకప్పు

తుపానులో ఇబ్బందులు రాకుండా చర్యలు

నగరంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల పరిస్థితులను ఆదివారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత సుడిగాలి పర్యటన చేసి పరిశీలించారు. కొరమీనగుంట, కరకంబాడి రోడ్డు, బస్టాండ్ ప్రాంతాలు, పార్వతీపురం, లక్ష్మీపురం సర్కిల్ ప్రాంతాలు, ఎస్వీడీసీఎల్ పక్కన లోతట్టు ప్రాంతాలను ఆమె పరిశీలిస్తూ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బందితో వైర్‌లెస్ సెట్ ద్వారా పలు సూచనలు చేస్తూ వర్షపు నీరు సక్రమంగా కాలువల్లో ప్రయాణించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై చెట్లు కూలిన ప్రాంతాల్లో వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లోని వ్యర్థాలను, రహదారులపై పడుతున్న చెట్టు కొమ్మలను, చెత్త డిబ్బలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కమిషనర్‌తో పాటు డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీఈలు, ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను ప్రాంతాల్లో జాగ్రత్త వహించండి

చంద్రగిరి: వాయుగుండం తుపానుగా మారడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ శిరీష సూచించారు. ఆదివారం ఎస్ఐ హిమబిందుతో కలసి ఆమె మండలంలోని వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతిభారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. తుపాను సమయంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే అధికారులకు తెలియజేయాలని ఆమె కోరారు.

మంగళంలో లోతట్టు ప్రాంతాలు జలమయం

తిరుపతి మంగళం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుమలనగర్ పంచాయతీలోని కేబీఆర్‌నగర్‌కు వరద ముంపు చేరడంతో రాత్రి నుంచి ఆ కాలనీ ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. విషయం తెలుసుకున్న ఆ పంచాయతీ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వరదల్లోనే నడుచుకుంటూ కేబీఆర్‌నగర్‌కు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. కేబీఆర్‌నగర్ వాసులను శివశంకర్ రాజుతో పాటు పంచాయతీ కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు దయాకర్ ట్రాక్టర్ల ద్వారా తిరుమల నగర్‌లోని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనంతరం వరదబాధితులకు సచివాలయం వద్ద వసతి, భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు తుపానులో ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. తుపాను పరిస్థితులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడాచైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

వర్షంతో కూలిన స్టూడియో పైకప్పు

తిరుపతి కల్చరల్: వర్షం కారణంగా చిన్నబజారు వీధిలోని మధుబాల స్టూడియో పైకప్పు కూలిపోయింది. దీంతో స్టూడియోలోని కంప్యూటర్లు, ప్రింటింగ్ పరికరాలు, రెండు స్టిల్ కెమెరాలు పూర్తిగా నలిగిపోయాయి. విషయం తెలుసుకున్న ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నేతలు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రాజ్ మాట్లాడుతూ స్టూడియో యజమాని కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఫొటో గ్రాఫర్ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

ఆర్‌సీపురంలో భారీవర్షం

రామచంద్రాపురం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో ఆదివారం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. పొలాల్లోకి అడుగులోతు నీరు చేరింది. చిన్నపాటి వంకలు, వాగులు ప్రవహిస్తున్నాయి. అనుప్పల్లి వద్ద ఉన్న పెద్దేటి వంక నుంచి నీరు ఉధృతంగా రావడంతో రాయలచెరువులో నీటిమట్టం కొంతమేర పెరిగింది. ఎంపీడీఓ శ్రీనివాసులు తుపాను నేపథ్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజులపాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహశీల్దార్ చిన్నవెంటేశ్వర్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా వర్షంతో ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



అధికారులతో సమావేశమైన ఎంపీడీఓ

మేం ఉన్నాం... మీకేం కాదు

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పర్యటన

చంద్రగిరి: ముంచుకొస్తున్న తుపాను ముప్పుపై అప్రమత్తం చేస్తూ... ముంచెత్తుతున్న వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్న స్థానికులకు మేమున్నామని భరోసా కల్పించారు. తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి. సహాయక చర్యల్లో అధికారులకు సూచనలు ఇస్తూ... ఆదివారం ఆయన తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులకు ఆహారపు పొట్లాలు, నిత్యావసర సరుకులను అందజేశారు. తిరుచానూరు, యోగిమల్లవరం, తనపల్లి, కుంట్రపాకం ప్రాంతాల్లో తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డితో కలిసి పర్యటించారు. తుపాను దాటికి లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరాయి. ఇళ్ల మధ్యకు చేరుకున్న నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రమాద పరిస్థితులను ముందుగా అంచనా వేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు సరఫరా, విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ వేముల యశోద, సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, శుభపద్మానాభరెడ్డి, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



ఆర్డీఓతో కలసి లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి











జేసీబీలతో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న అధికారులు, పునరావాస కేంద్రంలో లోతట్టు ప్రాంత ప్రజలు, ట్రాక్టర్లలో కేబీఆర్‌నగర్ వాసుల తరలింపు, ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేటి వంక, లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శిరీష, ఎస్ఐ హిమబిందు

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు తుడా చైర్మన్ పరామర్శ

తిరుపతి రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కుంట్రపాకం పంచాయతీ నాగూర్ కాలనీ వైఎస్సార్ సీపీ కార్యకర్త ఖాదర్ బాషాను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ప్రమాద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రహదారుల్లో ప్రయాణించే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలంటూ జాగ్రత్తలు తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మోహిత్‌రెడ్డి వెంట సర్పంచ్ శుభపద్మనాభ రెడ్డి, తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ కరిముల్లా వల్లీ, నాయకులు పాల్గొన్నారు.



ఖాదర్‌బాషాను పరామర్శిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

దుర్గసముద్రం సర్పంచ్‌కు మాతృ వియోగం

– శ్రద్ధాంజలి ఘటించిన చెవిరెడ్డి సోదరులు



ప్రసాద్‌రెడ్డిని ఓదారుస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: దుర్గసముద్రం సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి తల్లి మిట్టపల్లి కాంతమ్మ శనివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మరణంపై తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆదివారం ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్ రెడ్డిని పరామర్శించి, ఓదార్చారు.

సహాయక చర్యలు ముమ్మరం

తిరుపతి కల్చరల్: జిల్లాలో మూడు రోజుల నుంచి మిచాంగ్ తుపాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓజిలి మండలం కుందాం గ్రామంలోని గిరిజనులు, వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్ పురం ఎస్సీలు తుపానుతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెరువులు నిండిపోవడంతో ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయని, ఎస్టీ, ఎస్సీ కాలనీ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు.

పొంగిపొర్లుతున్న వాగులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలో ఆదివారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. శ్రీకాళహస్తి– కాళంగి మార్గంలో చిట్టత్తూరు వాగు రోడ్డుపై పొంగి పొర్లడంతో రాకపోకలు పూర్తి గా ఆగిపోయాయి. తహసీల్దారు సుధీర్‌రెడ్డి చిట్టత్తూరు వాగును పరిశీలించి రాకపోకలు జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కారాకొల్లు మార్గంలోను వాగు పొంగిపొర్లుతోంది. బసవయ్యపాళెం చెరువు సమీపంలోని ఇళ్లలోకి చేరుతుండటంతో ఎస్ఐ రాఘవేంద్ర తూము వద్ద చేరిన పూడికను తొలగించారు.

కార్మిక సంక్షేమ చట్ట సాధనకు పోరాటం

తిరుపతి కల్చరల్: హమాలీ కార్మికుల సంక్షేమ చట్టం సాధన కోసం సమర శంఖం పూరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం శ్రీబాలాజీ లారీ అండ్ అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా నేత చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ నేతలు ఉదయ్‌కుమార్, రాధాక్రిష్ణ, ఎన్‌డీ.రవి, హమాలీ యూనియన్ నేతలు బాబు, నాగరాజు, టి.సుబ్రమణ్యం, మునికృష్ణ, సుదర్శన్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

శాస్త్రోక్తంగా శ్రీకపిలేశ్వరస్వామి రుద్రయాగం



యాగశాలలో కొలువైన శ్రీకామాక్షి దేవి సమేత శ్రీకపిలేశ్వర స్వామివారు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజైన ఆదివారం రుద్రయాగం శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

జోతిష్యంతోనే దిశానిర్దేశం

- ఘనంగా ముగిసిన పాంచరాత్ర ఆగమ సదస్సు

తిరుచానూరు(చంద్రగిరి): పాంచరాత్ర ఆగమంలో తెలియజేసిన జోతిష్య శాస్త్రంతోనే మానవ మనుగడకు దిశా నిర్దేశమని జాతీయ సంస్కృత విద్యాపీఠం ఆచార్యులు చక్రవర్తి రంగనాథన్ తెలియజేశారు. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, భగవత్‌శాస్త్ర పాంచరాత్ర ఆగమ సంరక్షణ సభ సంయుక్త ఆధ్వర్యంలో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్దనున్న ఆస్థాన మండపంలో అఖిల భారత భగవత్‌శాస్త్ర పాంచరాత్ర ఆగమ విద్వత్ సమ్మేళనం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా విచ్చేసిన ఆచార్య రంగనాథన్ మాట్లాడుతూ పాంచరాత్ర ఆగమంలో భరత నాట్యం, సంగీతం, వాయిద్యం, జోతిష్య శాస్త్రాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు. శ్రీవామనాచార్యులు, శ్రీభగవద్ రామానుజాచార్యులు, శ్రీవేదాంత దేశికర్ పాంచరాత్ర ఆగమాన్ని రక్షించారని వివరించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్ర విశేషాలకు చెందిన 'శ్రీ భవిష్యకర సంహిత' గ్రంథాన్ని జాతీయ సంస్కృత విద్యాపీఠం విశ్రాంత ఆచార్యులు ఎల్ఎస్ భట్టర్ ఆవిష్కరించారు. తరువాత తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, మేల్కోటి వేద పాఠశాల, శ్రీరంగం వేద పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని పాంచరాత్ర ఆగమ విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



ఆగమ సదస్సులో మాట్లాడుతున్న వేద పండితులు

గోశాల ఆకస్మిక తనిఖీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలను ఆదివారం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల సిబ్బంది వర్షం కారణంగా రాకపోవడంతో ఉదయం 11.30 గంటలు దాటినా గోవులకు ఆహారం అందించక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి ఆహారం అందించాలన్నారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో గోవులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోశాల సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న చైర్మన్ తారక శ్రీనివాసులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చంద్రగిరి : పూతలపట్టు–నాయుడుపేట జాతీ య రహదారిపై మామండూరు జగనన్న కాలనీ సమీపంలోని కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఎస్ఐ హిమబిందు తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయన్నారు. మద్యం సేవించి వెళుతూ ప్రమాదవశాత్తు కాలువలో పడి ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు వివరించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు.

